


మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
గురువారం 25 - సెప్టెంబర్ - 2025
ఎడిటర్ : కంచర్ల అచ్యుత రావు
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం


# ఎన్టీఆర్ సాహస ఉద్యానవన పార్కును సందర్శించిన కలెక్టర్



**సీతంపేట ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** మన్యం జిల్లా సీతంపేటలోని ఎన్టీఆర్ సాహస ఉద్యాన పార్కును జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి బుధవారం సందర్శించారు. పార్కులో ఉన్న సాహస, ఇతర క్రీడలు పరిశీలించారు. పార్కు మరింత అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి వివరించారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. పర్యాటకులు మరింత ఆకర్షితులయ్యే విధంగా చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. మెట్టుగూడ సమీపంలో చింతాడ గిరిజనులు నిర్మిస్తున్న పీఎం జన్‌మన్ ఇళ్లను పరిశీలించారు. నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో భామిని మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. భామిని మండలం మనుమకొండను ఆకాంక్షిత ఆశావాహిక గ్రామంగా ఎంపిక చేసిన నేపథ్యంలో అక్కడ చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.






# పేదల గృహనిర్మాణాలను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** పేదల గృహ నిర్మాణ పనులు వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలో గృహ నిర్మాణ ప్రగతి పై హౌసింగ్ అధికారులు, స్పెషల్ అధికారులు, జోనల్ కమిషనర్లు అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరం నందు సమీక్ష చేశారు. జిల్లాలో వివిధ దశలలో ఉన్న పేదల గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయడంపై దిశా నిర్దేశం చేశారు. మంచి పురోగతి సాధించిన అధికారులను అభినందిస్తూ వెనుకబడిన వారి పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. మార్చి 2026 నాటికి గృహ నిర్మాణ పనులు పూర్తి చేయవలసి ఉన్నందున సంబంధిత అధికారులు అందరూ పేదల గృహ నిర్మాణం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మార్చినాటికి పూర్తి చేసుకోకపోతే ఇంటి తోపాటు స్థలం పట్టా కూడా రద్దు చేయడం జరుగుతుందని లబ్ధిదారులకు

2వ పేజీలో









# స్ట్రీట్ వెండర్స్, ఫుడ్ కోర్ట్ వ్యాపారులకు తిరిగి స్టాల్స్ ఏర్పాటు



- అసెంబ్లీ సమావేశాలు ముగియగానే వర్తకుల సమస్యకు పరిష్కారం
- చిరు వ్యాపారులకు వెండర్ కార్డులతో సహా వ్యాపారాలు పునరుద్దిస్తాం
- కూటమి ప్రభుత్వం స్ట్రీట్ వెండర్స్ కు అండగా ఉంటుంది
- దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖపట్నం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** నగరంలో తొలిగించిన స్ట్రీట్ వెండర్స్, ఫుట్ కోర్టు వర్తకుల వ్యాపారాలను తిరిగి ఏర్పాటు చేయిస్తానని జనసేన పార్టీ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే ఆపరేషన్ లంగ్స్- 2.0 ద్వారా రోడ్డున పడిన వీధి వ్యాపారస్తుల సమస్యను పరిష్కరిస్తానన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఎదురవకుండా స్ట్రీట్ వెండర్స్ కు వెండర్ కార్డులతో సహా తమ వ్యాపారాలు పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం చిరు వర్తులకు వ్యతిరేకం కాదని, స్ట్రీట్ వెండర్స్ యాక్ట్ – 2014కు అనుగుణంగా చట్టబద్ధమైన వ్యాపారాలు చేసుకునేందుకు అండగా ఉంటుందని వంశీకృష్ణ చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉండగా నగరంలో ఫుడ్ కోర్ట్, వీధి వ్యాపారాలు తొలగింపు చర్యలను ఆయన ఖండించారు. ఏళ్ల తరబడి చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకొని జీవనోపాధి సాగిస్తున్న పేదలు ఒక్కసారిగా తమ వ్యాపారాలను తొలగిస్తే రోడ్డున పడతారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తమ వ్యాపారాన్ని నమ్ముకొని పిల్లల చదువు, ఇతర అవసరాలకు అప్పులు చేసుకుని బ్రతుకుతున్న వారి జీవనశైలని ప్రజాప్రతినిదిగా అర్థం చేసుకోగలనని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చిరువర్తకుల బ్రతుకులు అధోగతి పాలవకుండా రక్షణ కల్పించే బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్కరి జీవనం మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుందే కానీ వ్యతిరేక కార్యకలాపాలకు పూనుకోదనే వివరించారు. ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటాయని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. స్ట్రీట్ వెండర్స్ తొలగింపులపై ప్రతిపక్ష పార్టీలు చేసే విమర్శలు అసత్య ప్రచారాలేనని తిప్పి కొట్టారు. తొలగింపులను భూతంగా చూపి తమ పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. వీధి వ్యాపారస్తుల వ్యాపార బాధ్యత వారి రక్షణ రాష్ట్ర ప్రభుత్వాన్ని దేనిని గుర్తు చేశారు. దీనిపై వీధి వ్యాపారస్తులు ఎలాంటి సందేహం లేకుండా ధైర్యంగా ఉండాలని, అసెంబ్లీ సమావేశాలు ముగియగానే తమ వ్యాపారాలను యధావిధిగా నిర్వహించుకునేలా వెండర్ కార్డులు పంపిణీ చేసి రక్షణ కల్పిస్తానని వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

# మానవత్వం చాటిన హెూం మంత్రి అనిత..దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందచేత



**పాయకరావుపేట ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో హెూం మంత్రి వంగలపూడి అనిత బుధవారం పర్యటించారు. పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు సుంకర ఆనంద్ కు ఆమె సొంతనిధులతో ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ ను అందజేశారు. చిన్నతనం నుండి శారీరక అంగవైకల్యంతో బాధపడుతున్న ఆనంద్, కూరగాయలు అమ్ముతూ జీవనం కొనసాగిస్తున్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన మంత్రి అనిత ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఆనంద్ పరిస్థితిని చూసిన మంత్రి చలించి, తన సొంత నిధులతో ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ కొనుగోలు చేసి అందజేయడమే కాకుండా, కొంత నగదు సహాయం కూడా చేశారు. నక్కపల్లి క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ట్రై సైకిల్‌ను ఆనంద్ కు స్వయంగా అందించారు. ఈ సందర్భంగా ఆనంద్ హెూం మంత్రి అనిత గారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## అన్ని విధాల సహకరిస్తా : ఎస్పి

**పార్వతీపురం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ ఉద్యోగులు, దివంగత పోలీస్ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటామని, అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని రిటైర్మెంట్, డెత్ బెనిఫిట్స్ సకాలంలో అందేలా సత్వర చర్యలు చేపట్టి పోలీసు సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని జిల్లా ఎస్పి ఎస్విమాధవ్ రెడ్డి పేర్కొన్నారు.

పోలీసు ఉద్యోగ విరమణ, ఉద్యోగస్తులు సర్వీసులో ఉంటూ మృతి చెందిన పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులు సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలపై జిల్లా ఎస్పి అధ్యక్షతన బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు రావాల్సిన బెనిఫిట్స్‌పై సకాలంలో అందేలా ఉత్తరప్రత్యుత్తరాలు జరపాలన్నారు. అదేవిధంగా ఇతర శాఖల నుంచి ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని, వాటికీ పరిష్కార మార్గం చూపేలా సంబంధిత అధికారులతో చర్చిస్తామన్నారు.

# చిల్లర వర్తకుల కడుపుకొడుతున్న కూటమి ప్రభుత్వం

## - జీవిఎంసీ జోన్ 8 కార్యాలయం వద్ద ఏ.ఐ.టియు.సి ఆంధోళన

**పెందుర్తి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** కూటమి ప్రభుత్వం దసరా పండుగ ముందు వేలాదిమంది తోపుడుబండ్ల వ్యాపారాలను నాశనం చేసి వారి కుటుంబ సభ్యుల కడుపులు కొట్టిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. జీవిఎంసీ అధికారులు లంగ్స్ పేరుతో షాపులను కూల్చివేయడాన్ని నిరసిస్తూ వేపగుంట జోనల్ కార్యాలయం వద్ద 92,93,94,95,96,97,98 వార్డుల పరిధిలో గల వ్యాపారస్తులతో ఏఐటియుసీ నాయకులు భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వందలాదిమంది చిరువ్యాపారులతో కలిసి జోనల్ కార్యాలయంలోకి చొచ్చుకువెళ్లి అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. తమను వ్యాపారాలు చేసుకోనివ్వాలంటూ నిరసన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో






పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవిఎంసీ అధికారులు తీరు అమానవీయంగా ఉందని విమర్శించారు. ఒక్కసారిగా చిరువ్యాపారుల షాపులను కూల్చివేయడం దారుణమని మండిపడ్డారు. ఏ.ఐ.టీయూ.సి జోన్ 8 కార్యదర్శి వై.రాంబాబు మాట్లాడుతూ ఎక్కడ వారిని అక్కడే వ్యాపారాలు నిర్వహించుకునేలా తక్షణమే కార్పొరేటర్లు జీవీఎంసీ అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేయాలని లేని ఎడల చిరు వ్యాపారస్తులతో కార్పొరేటర్ల ఇళ్లు ముట్టడించటానికి వెనకాడబోమని స్పష్టం చేశారు. 2014 న సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేసి హాకర్ జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యమాంబ తోపుడు బండ్ల వ్యాపారులు సంఘం నాయకులు కే.శ్రీను, నాని, రాజు, వెంకటరమణ,గౌరీ తదితర వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# పేదల గృహనిర్మాణాలను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**ఒకటి తరువాయి**

తెలియజేయాలన్నారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అదనంగా ఇస్తున్న ఆర్థిక సహాయం పై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, ఈ అదనపు సహాయంతో పూర్తిస్థాయిలో ఇంటి నిర్మాణం పూర్తి అవుతుందని లబ్ధిదారులకు తెలియ జేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు డ్రైనేజీలు తదితర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణలలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. పూర్తయిన గృహాలకు కాంట్రాక్టర్ ద్వారా డోర్లు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. స్టేజ్ కన్వర్షన్ పై దృష్టి పెట్టాలని, ప్రతి సచివాలయంలో జియో టాగింగ్ పూర్తి చేయుటకు ప్రణాళిక రూపొందించాలని, స్వచ్ఛందంగా ఇల్లు నిర్మాణానికై ముందుకు వచ్చేవారికి అవసరమైన సహకారం అందించడం ద్వారా వారం వారం మెరుగైన ప్రగతి సాధించాలన్నారు. కాళీ గా ఉన్న ప్లాట్ లలో స్థలాలు కేటాయించేటప్పుడు పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా ఇవ్వాలన్నారు. ఇళ్ళ నిర్మాణాల లక్ష్యసాధనలో వెనుకబడిన వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇన్చార్జి హౌసింగ్ పీడీ సూరిబాబు, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, జోనల్ కమిషనర్లు, హౌసింగ్ డిఈలు, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

# దుకాణాలు, సంస్థల సవరణ బిల్లు 2025తో కార్మికులకు ప్రయోజనం : కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**అమరావతి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** శాసనసభలో ఆమోదం పొందిన దుకాణాలు, సంస్థల సవరణ బిల్లు 2025 ద్వారా కార్మికులు, యజమానులకు మంచి జరగనుందని ఏపీ కార్మిక శాఖ మంత్రి సుభాష్ తెలిపారు. బిల్లు ఆమోదం పొందడాన్ని హర్షిస్తూ, మంత్రి వాసం శెట్టి సుభాష్ ను కార్మిక సంఘాల ప్రతినిధులు, సచివాలయంలోని తన ఛాంబర్ లో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోజువారీ పని గంటలు 8 నుండి 10కి పెంచినా, వారానికి 48 గంటలకే పరిమితం చేయడం వల్ల కార్మికులకు వారంలో రెండు రోజుల విశ్రాంతి లభించనుందన్నారు. ఓవర్‌టైమ్ గంటలు 150 నుండి 140కి తగ్గించగా, మహిళా కార్మికులకు రాత్రి 8 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు పని చేసే అవకాశం కల్పించడంతో పాటు వారి భద్రతకు అవసరమైన చట్టపరమైన రక్షణలు కూడా ఏర్పాటు చేయడం పట్ల కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేశాయని మంత్రి తెలియచేసారు. ముందస్తు నోటీసు లేకుండా ఉద్యోగం నుండి తొలగించకుండా కఠిన నిబంధనలు అమలు చేయడం ద్వారా కార్మికుల హక్కులు మరింత బలపరచబడటంతో కూటమి ప్రభుత్వం కార్మికుల పక్షపాతి అని మంత్రి సుభాష్ తెలిపారు.

# అంగరంగ వైభవంగా శ్రీ వరాహ లక్ష్మి నృసింహ స్వామి నిత్య కల్యాణం



**సింహాచలం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణ ధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.



# ఆది కర్మయోగిపై పిఒ సమీక్ష

**పార్వతీపురం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** ఆది కర్మయోగి అభియాన్ కింద సిద్ధం చేసిన విజన్ ప్లాన్‌ను ఎంపిడిఒలు పునః పరిశీలించి ఐటిడిఎకు సమర్పించాలని జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశిం చారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయంలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో ఆది కర్మయోగి అభియాన్‌పై ఎంపిడిఒలు, జిల్లా మాస్టర్ ట్రైనీలు,బ్లాక్ మాస్టర్ ట్రైనీలతో జెసీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కురుపాం, కొమరాడ,సాలూరు,పాచిపెంట,మక్కువ, సీతంపేట,భామిని, వీరఘట్టం మండలాల్లోని 165 గ్రామాల్లో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం అమలు కానుందని తెలిపారు.

## ప్రమాద ఘంటికలు మోగిస్తున్న గాజువాక - స్టీల్ ప్లాంట్ రహదారి

**- దుర్గానగర్ దగ్గర ప్రమాదకర గుంతలు**
**- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు**



**గాజువాక ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** గాజువాక నుండి స్టీల్ ప్లాంట్ వైపు వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదఘంటికలు మోగిస్తోంది. ముఖ్యంగా దుర్గానగర్ దగ్గర భారీ గుంటలు ఏర్పడి వాహనదారులకు తీవ్ర సమస్యలు సృష్టిస్తున్నాయి. వర్షంపడితే చాలు గుంతల్లో నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు, నాలుగుచక్రాల వాహనదారులు గుంతల్లో దిగి తీవ్రప్రమాదాలకు గురవుతున్నారు.

రాత్రివేల్లలోల స్పీడ్ గా వెల్లేవారు గుంతల్లో దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం మవందలాది వాహనాలు బస్సులు, ఆటోలు ఈరోడ్డుగుండా రాకపోకలు సాగిస్తున్నారు. స్కూల్ ఆటోలు ఇలా వెల్లడంతో చిన్నారులకు ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం: స్థానికులు ఎన్నిసార్లు చెప్పినా అధికారులు చీమకుట్టకుండా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. గుంతలను కప్పి ప్రమాదాల నుంచి కాపాడాలని కోరుతున్నారు. గుంతలను పూడ్చడం, వర్షపునీరు నిల్వ ఉండకుండా చూస్తే ప్రమాదాల బారినుండి తప్పించిన వారవుతారని కోరుతున్నారు. ప్రస్తుతం గుంతలవద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని , హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పోలీస్ పర్యవేక్షణ ఉ:డాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అనకాపల్లి జిల్లాలో బలవంతపు భూసేకరణ ఆపాలి

**అనకాపల్లి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** అనకాపల్లి జిల్లాలో బలవంతపు భూసేకరణ వెంటనే ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి బి వెంకట్ , రాష్ట్రఅధ్యక్షులు దడాలసుబ్బారావు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న డిమాండ్ చేసారు. ఈ మేరకు బుధవారం ఛలో విజయవాడ కార్యక్రమం చేపాట్టి రెవెన్యూ మంత్రి అలగాని సత్యప్రసాద్ సి సి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనకాపల్లిజిల్లాలో బలవంతంగా రైతు కూలీలను భయ భ్రాంతులకు గురిచేస్తు దేశ సరి హద్దుల్లో సైన్యాన్ని మొహరించినట్లు భూసేకరణ చేసి గ్రామాలలో రైతులను కూలీలను ఇళ్ల నుండి బయటకు రానీయ కుండా బంధువులను సైతం ఆగ్రామాలలోకి రానీయకుండా అత్యంత దుర్మార్గంగా కిరాతకంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. వారికి మద్దతుగా వెల్లిన నాయకులను సైతం ముందస్తు అరెస్టులు చేస్తూ రైతు,కూలీల మనో ధైర్యాన్ని దెబ్బ తీసి భూములు లాక్కొని బయటకి మాత్రం వారి కోరిక మేరకే భూములు తీసుకుంటున్నామని కూటమి ప్రభుత్వం బుకాయిస్తుందని విమర్శించారు. బల వంతంగా



భూములను గుంజు కొని పర్యావరణానికి హానిచేసే కాలుష్యాన్ని వెదజల్లే కంపెనీలు పెట్ట డానికి,అభివృద్ధి పేరుతో గతంలో పరవాడలో ఫార్మాసిటీ కోసం 3064 ఎకరాలు, అచ్యుతాపురంలో ఎస్ఇజెడ్ కోసం 9,174 ఎకరాలు,రాంబిల్లి, ఎస్.రాయవరంలో ఎన్ఎఒబి కోసం 5,300 ఎకరాలు, మునగపాకలో లాజిస్టిక్ హబ్ కోసం 374 ఎకరాలు, సబ్బవరంలో లామేరియన్ పెట్రోలియం యూని వర్సిటీల కోసం 272 ఎకరాలు తీసుకుని కొన్ని పరిశ్రమలు నిర్మించారని పేర్కొన్నారు. ఇంకా వేల ఎకరాలు భూములు ఖాళీగా ఉన్నాయని తెలిపారు ఇక్కడ నిర్మించిన కంపెనీల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిర్వాసితులకు కేటాయించిన కాలనీల్లో నేటికీ మౌళిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు ఈభూములు చాలవన్నట్లు దేవరాపల్లి మండలం లోని చింతల పూడి సమ్మెద పల్లపు కోడాబు పరివాహక ప్రాంతంలో ఆదాని హైడ్రో పంపుడు స్టోరేజ్ పవర్ ప్లాంట్ కోసం 820 ఎకరాలు, ఎస్ఇజెడ్ల కోసం కె.కోటపాడులోని.ఆర్లే చింతపాక గరుగుబల్లి గుల్లేపల్లి ప్రాంతంలోని 1200 ఎకరాలు, బుచ్చయ్య పేట మండలం లోని 1691 ఎకరాల భూములను బలవంతంగా సేకరించడానికి ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. మా భూములు ఇవ్వబోమని, కాలుష్యకరమైన పరిశ్రమలు మా ప్రాంతాల్లో పెట్టొదని. రైతులు, కూలీలు గిరిజనులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించు కోకుండా ప్రైవేట్ వ్యక్తుల లాభాలే ధ్యేయంగా బలవంతంగా భూసేకరణ చేయడానికి పూను కుంటుందని,తెలిపారు నక్కపల్లి రాజయ్యపేటలో బల్క్ డ్రంగ్క్ వ్యతిరేకంగా పోరాడుతున్న మత్స్యకారులపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించి భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని ఈనెల 27 మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం పబ్లిక్ హిరింగ్ జరుపుతున్నారని దీన్ని ప్రజలు పూర్తిగా వ్యతి రేఖిస్తున్నారని అయినప్పటికి బలవంతంగా పబ్లిక్ హిరింగ్ జరుపుతున్నారని దీన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు 2013 భూ సేకరణ చట్టాన్ని ఎక్కడా అమలు చేయడం లెదన్నారు నిర్వా సితులకు చట్ట ప్రకారం ఎక్కడా పరిహారం, ఫ్యాకేజీ ఇవ్వ లెదన్నారు. భూములు,కోల్పోయిన ఏఒక్కరైతు బిడ్డ కూడా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వ లేదని తెలిపారు. మా భూములు జోలికి వస్తే ఖబడ్దార్ అని పాల కులకు తెలియ జేయడానికే ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు వెంటనే జిల్లాలోని బలవంతపు భూసేకరణ ఆపాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## జడ్పీలో ప్రోటోకాల్ రగడ.. సమావేశాన్ని బహిష్కరించిన సభ్యులు

**శ్రీకాకుళం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** శ్రీకాకుళం జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కు ఇటీవల పాలకొండలో జరిగిన అవమానంపై సభ్యులు తీవ్రంగా ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్తు సమావేశం మందిరంలో జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ పాలకొండ మండల సమావేశానికి వెళ్తున్న తనను ఎంపీడీవో,పోలీసులు అడ్డుకుని, నెట్టి వేశారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీగా తాను పాలకొండ నియోజకవర్గాన్ని ఆప్షనల్ గా తీసుకున్నానని తనని అక్కడికి వెళ్ళనీయకుండా అడ్డుకుని తీవ్రంగా అవమానపరిచారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడిన ఎంపీడీవోపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ అంశంపై పలువురు జడ్పీటీ సీలు, ఎంపీపీలు ఎంపీపీలు ఎమ్మెల్సీని అవమా నించడంపై తీవ్రంగా ధ్వజ మెత్తారు. మండలం, పంచాయతీల్లో జరుగుతున్న పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు తమను పిలవకుండా పాల్పడుతున్నాడని మండిపడ్డారు. దీనిపై జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, సభ్యులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది.

## మెరుగైన సేవలు అందించండి : కలెక్టర్



**గరివిడి / చీపురుపల్లి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** సచివాలయ సిబ్బంది సకాలంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం గరివిడి మండలం కొండపాలెం సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలను పరిశీలించి సిబ్బంది సమయానికి విధుల్లో హాజరై, ప్రజలకు అవసరమైన సేవలను అందిస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి, అందుతున్న సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. వైద్య విభాగంపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, వ్యాక్సినేషన్లు, ఇమ్యూనైజేషన్ షెడ్యూల్ ప్రకారం తప్పనిసరిగా అందించాలన్నారు. గర్భిణుల పట్ల మరింత శ్రద్ధ చూపాలని, గర్భధారణ నుంచి ప్రసవం వరకు ప్రతి దశలో క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేసి, ఆరోగ్య సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన మంచినీటి సరఫరా నిరంతరంగా కొనసాగాలని, ఎక్కడా నీటి కాలుష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా సకాలంలో సర్టిఫికెట్లు జారీ చేయడం ద్వారా ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని, నాణ్యమైన మరియు వేగవంతమైన సేవలందించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముందుగా కలెక్టర్ చీపురుపల్లి ఆర్డీవో కార్యాలయం, ఎంపిడిఒ కార్యాలయాలను సందర్శించారు. అక్కడ ఆర్డిఒ, తాహశ్లీర్, ఎంపిడిఒ, డిఎస్పి, ఇతర అధికారులతో సమావేశమై, ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. రైతులకు ఎరువుల సరఫరా సజావుగా జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, వర్షాకాలం నేపథ్యంలో వ్యవసాయానికి అవసరమైన సహకారం అందించాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా ప్రతి విభాగం సమన్వయంతో ముందుకు సాగాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో బి.ఆశయ్య, తాహశీల్దార్ డి.ధర్మరాజు, ఎంపిడిఒ సురేష్, డిఎస్పి రాఘవులు ఆయా కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఖైదీలకు పోషమ్మ పథకం అందిస్తాం

**- విశాఖ సెంట్రల్ జైలు సందర్శించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్**
**- మహిళా ఖైదీల సమస్యలు తెలుసుకున్న శైలజ**

**విశాఖపట్నం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ బుధవారం ఉదయం విశాఖ సెంట్రల్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ముందుగా జైలులోని మహిళా బ్యారక్ను పరిశీలించిన ఆమె, వారికి అందుతున్న వసతులపై సమగ్రంగా పరిశీలించారు. తరువాత మహిళఖైదీలకు అందుతున్నభోజన సౌకర్యాలను పరిశీలించి ఆహారం రుచి చూసారు. జైలులో మహిళల జీవనశైలి, వారికి అందిస్తున్న కార్యక్రమాలు, హాస్పిటల్, బేకరీ, ఫ్యాక్టరీల పనితీరును సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జాతీయ మహిళా కమిషన్ ఆదేశాల మేరకు నవరాత్రి సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ తరపున పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ




పోషమ్మ పథకం అమలు చేస్తున్నదని ,మహిళా ఖైదీల కు కూడా 'పోషమ్మ' పథకం కింద ప్రత్యేక డైట్ ప్లాన్ అమలు చేయాలని పరిశీలిస్తున్నామన్నారు. "ప్రస్తుతం జైలులో 80 మంది మహిళలు ఉన్నారనీ, వీరిలో 50 మంది గంజాయి అక్రమ రవాణా కేసుల్లో అరెస్టయిన వారు ఉన్నారన్నారు. ఒడిశా, చెన్నై ప్రాంతాలకు చెందిన మహిళలు కూడా ఉన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో మత్తు పదార్థాల రవాణా కేసుల్లో జైలుకి వస్తున్నారని ఆవేదన వ్యక్తంచేసారు. ఇలాంటి వారిని అవగాహన కల్పించి, స్వశక్తితో బతికేలా చర్యలు చేపడతామన్నారు. వీరికి కౌన్సిలింగ్ ఇప్పించి తిరిగి సమాజంలో





గౌరవ ప్రదంగా జీవించే విధంగా చేయాలని కృషి చేస్తున్నామన్నారు. ఇటీవల ప్రసవం అయిన మహిళా ఖైదీ బిడ్డను తన చేతులలోనికి తీసుకుని ఎత్తుకున్నారు. జైలులో ఉన్న మహిళా ఖైదీ లకు ఐసిడిఎస్ ద్వారా పౌష్టికాహారం అందించే విధానంపై కూడా పరిశీలన జరుగుతోందని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ జాయింట్ డైరెక్టర్ చిన్మయి దేవి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామలక్ష్మి, ఇతర ఐసిడిఎస్, సెంట్రల్ జైల్ సిబ్బంది పాల్గొన్నారు.



# అంగరంగా వైభవంగా సిరిమాను తరలింపు సంబరం

**గంట్యాడ ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** విజయనగరం పైడితల్లి జాతరలో ప్రధాన ఘట్టమైన సిరిమాను తరలింపు సంబరం బుధవారం అంగరంగా వైభవంగా జరిగింది. మహిమానితమైన సిరిమాను ఇరుసుమాను వృక్షాలు ఈ ఏడాది గంట్యాడ మండలం కొండతామరాపల్లిలో చల్ల అప్పారావు, రామకృష్ణ, నారాయణమూర్తి, లోకవరపు సత్యం కల్లంలో సాక్షాత్కరించాయి. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల నడుమ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు, దేవస్థానం ఈవో శిరీష్, పైడిమాంబ దీక్షధారులంతా వృక్షానికి పసుపు కుంకుమలు సమర్పించి దీపారాధనలతో అఖండ అర్చనలు నిర్వహించారు. అంతకముందు నిర్ణయించిన మూహూర్తానికి వేదపండితులు మంత్రోచ్ఛరణ, నాదస్వరాల నడుమ గొడ్డలితో గాట్లుపెట్టి సిరిమానుగా మలిచే పవిత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఇరుసుమానుకు ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులంతా పైడిమాంబ నామస్మరణతో ఆ ప్రాంగణమంతా ప్రతిధ్వనించింది. అనంతరం 10వేల మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టి భారీ ఊరేగింపుతో సిరిమానును తరలించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఐవీపీ రాజు, కొండపల్లి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.





# బడిదేవరకొండ ఆక్రమణలో అడ్డంగా దొరికిన అధికార్లు



**పార్వతీపురం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** మండలంలోని బడిదేవర కొండపై గ్రానైట్ మైనింగ్ అన్ని అనుమతులతోనే జరుగుతున్నట్లు మైనింగ్ జిల్లా అధికారి ఈనెల 15న ప్రకటన విడుదల చేశారని, ఆ ప్రకటనలో అధికారులే తప్పులు చేసినట్లు స్పష్టమైందని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, గ్రామీణ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షులు బొత్స నరసింగరావు అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడారు. బడిదేవర కొండ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా లైసెన్స్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఎలుగుల మెట్టపై ప్రజాభిప్రాయసేకరణ చేశామని చెప్పిన మైనింగ్ అధికారి, బడిదేవరకొండపై కూడా ప్రజాభిప్రాయ సేకరణ చేశామని ఎందుకు చెప్పలేదంటే, అక్కడ ప్రజాభిప్రాయ సేకరణే చేయకుండా గ్రానైట్ లీజు లైసెన్స్ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించే దమ్ముందా అని సవాల్ చేశారు. బడిదేవర కొండపై ఎక్కడ లైసెన్స్ ఇచ్చారో అక్కడ హద్దులు నిర్ణయించకుండా గ్రానైట్ తవ్వడానికి మైనింగ్ శాఖ ఎలా అంగీకరిస్తుందని ప్రశ్నించారు. అది రిజర్వ్ ఫారెస్టు ప్రభుత్వ భూమని, హద్దులు చూపమని అటవీ అధికార్లు ఎంత మొత్తుకున్నా ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. ఫారెస్టు అధికార్ల అభ్యంతరాలను నివృత్తి చేసి అనుమతులు ఇవ్వొచ్చని హై కోర్టు గతంలో ఉత్తర్వులు ఇచ్చిందని, ఫారెస్ట్ అధికార్ల అభ్యంతరాలు పట్టించుకోకుండా మైనింగ్ అనుమతులు ఎలా ఇచ్చారో, ఎవరి ఒత్తిడితో ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. సిల్ట్ సిడిమెంట్ ప్రవాహాన్ని ఆపడానికి వర్కింగ్ పిట్ కోసం డ్రెయిన్, సిల్టేషన్ ప్లాంట్ నిర్మిస్తామని గ్రానైట్ కంపెనీ ప్రతినిధి ఇచ్చిన హామీకి వ్యతిరేకంగా గ్రానైట్ జరిగిందని అంగీకరించారని చెప్పారు. మరి నిబంధనలు ఉల్లంఘించి ఏడాదిగా మైనింగ్ జరుగుతుంటే సంబంధిత శాఖ ఆపకపోవడం ప్రజలకు ద్రోహం చేసినట్టేనని అన్నారు. దీనివల్ల చెరువు కబ్జాకు గురై పాడి బంగారి దొర మరణానికి కారణమైందని, కనీసం దొర చనిపోయినా మైనింగ్ అధికార్లు గ్రానైట్ లైసెన్స్ యజమానిపై కేసు పెట్టి, అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. గిరిజనులకు డి.పట్టాలు, ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలిచ్చిన భూములను గ్రానైట్ మైనింగ్ కంపెనీ ఆక్రమించలేదని, మైనింగ్ అధికారి సర్టిఫికెట్ ఇవ్వడంపై రెవెన్యూ, ఫారెస్ట్ అధికార్లు వచ్చి గిరిజనుల భూములు గ్రానైట్ కంపెనీ ఆక్రమించిందో తేల్చడంలో జాప్యం ఎందుకని నిలదీశారు. ఈ రకంగా మైనింగ్, రెవెన్యూ, పర్యావరణ అధికారులందరూ తెలిసి చేసిన తప్పులేనని, కావున తక్షణమే బడిదేవరకొండపై గ్రానైట్ మైనింగ్ ఆపేయాలని, లీజు లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని, బంగారి దొర మరణానికి కారణమైన గ్రానైట్ మైనింగ్ యజమానిని అరెస్టు చేయాలని, దొర కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కొండ రక్షణ కోసం భవిష్యత్తులో జరిగే పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.



# పర్యాటక సీజన్ నాటికి ఎన్టీఆర్ పార్క్ సిద్ధం చేయాలి



**సీతంపేట ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** పర్యాటక సీజను ప్రారంభం నాటికి ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కును సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్కు అభివృద్ధికి సూచించిన పనులన్నీ అక్టోబర్ మొదటి వారానికి పూర్తి కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పార్కుకు విచ్చేసే పర్యాటకులకు పచ్చదనం, పరిశుభ్రంతో మంచి ఆహ్లాదకర వాతావరణం కనిపించాలని పేర్కొన్నారు. గిరిజన యువత వివిధ రకాల షాపులను నిర్వహించుకునేలా అనుమతి ఇవ్వాలని, తద్వారా వారికి ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పర్యాటకుల అవసరాలు తీరుతాయని కలెక్టర్ వివరించారు. స్థానిక ఎన్టిఆర్ అడ్వెంచర్ పార్కును కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం, మన్యం జిల్లా నలుమూలల నుంచి ఈ అడ్వెంచర్ పార్కుకు పర్యాటకులు నిత్యం వస్తుంటారని, ఇంతటి ప్రాముఖ్యత గల పార్కును మరింత శోభాయమానంగా తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ అధికారులను ఆదేశించారు. పర్యాటకుల వినోదానికి నిర్మించిన 3డి, 5డి థియేటర్లతో పాటు పార్కు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచడం వల్ల పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుందని వివరించారు. తొలుత మండలం లోని మెట్టుగూడ జలపాతాన్ని కలెక్టర్ సందర్శించారు. అనంతరం మెట్టుగూడ వద్ద గల పిఎం జన్ మాన్ కింద నిర్మితమవుతున్న గృహాలను కలెక్టర్ తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మనుమకొండ గ్రామాభివృద్ధికి కృషి నీతి అయోగ్ ద్వారా ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాం కింద ఆదర్శ గ్రామంగా ఎంపికైన భామిని మండలంలోని మనుమకొండ గ్రామాన్ని అన్ని విభాగాల్లో అభివృద్ధి పథంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఐటిడిఎ మీటింగ్ హాల్లో భామిని మండలానికి చెందిన మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీతి అయోగ్ ద్వారా మంజూరైన మోడల్ అంగన్వాడీ భవనాలు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలోని అందరికీ ఆరోగ్య కార్డులు ఉండాలని, మండలంలో ప్రతి గ్రామానికి శ్మశానవాటిక ఉండాలని సూచించారు. ప్రతి చెరువును ఉపాధి హామీ చట్టం ద్వారా అభివృద్ధి చేయాలన్నారు. కొత్తగా ఫారం పాండ్ పనులను చేపట్టాలని సూచించారు. సర్పంచులతో సమావేశం నిర్వహించి వారి గ్రామాలకు అవసరమై అభివృద్ధి పనులకు ప్రణాళికను తయారు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో భామిని తహాశీల్దార్, ఎంపిడిఒ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సీతంపేట మండలం మండలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో కాసేపు ముచ్చటించారు. పిల్లలతో వివిధ రకాల ఆటలను కలెక్టర్ స్వయంగా ఆడించారు. అదే విధంగా గ్రామంలోని విడివికె కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విడివికె ద్వారా ఉత్పత్తి చేస్తున్న గిరిజన ఉత్పత్తులను పరిశీలించి, వీటికి మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. విడివికెలో రికార్డులను తనిఖీ చేసి నిర్వహణ సక్రమంగా ఉండాలని అన్నారు. ఈ పర్యటనలో ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎపిఒ జి.చిన్నబాబు, ఇఇ రమాదేవి, డిడి అన్నదొర, డిఇ నాగభూషన్, హౌసింగ్ ఇఇ, ఎంపిడిఒ, తహాశీల్దార్ శ్రీకన్య, సిడిపిఒ సింహాలమ్మ పాల్గొన్నారు.

## ఇంటి పన్ను రద్దు చేయాలని ధర్నా




**విజయనగరం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** పెంచిన పన్నులు రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తూ నగరంలోని 45వ డివిజన్ పరిధిలో 55వ సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర రావు మాట్లాడుతూ ఎల్బిజి నగర్లో పేదలు గుడిసెలు కట్టుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం సంవత్సరానికి 54 రూపాయలు మాత్రమే పన్ను వేయాలని, కానీ వీరికి 6నెలలకే రూ.2వేలు పైన పన్నులు వేస్తున్నారన్నారు. నగరంలో పేదల గుడిసెలు, రేకుల ఇళ్లకు 54 రూపాయలే పన్ను వేస్తున్నారని, కానీ 55వ సచివాలయం పరిధిలో మాత్రం వేలాది రూపాయలు పన్నులు వేయడం విడ్డురంగా ఉందన్నారు. ఎల్.బాగ్యలక్ష్మి అసెస్ మెంట్ నెంబర్ 1093063833 కు రూ.4, 382పన్ను, సిహెచ్ మేరీ (అసెస్ మెంట్ నెంబర్ 109063793)కు రూ.2876 పన్ను వేశారన్నారు. ఇలా పన్నులు కట్టమని నోటిసులు పంపడం సరైనది కాదని, తక్షణమే ప్రభుత్వం జిఓ ప్రకారం 54 రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయం ఇన్స్పెక్టర్ సత్య నారాయణకు వినతి అందజేశారు. సమస్య పరిస్కారం కాకపోతే మున్సిపల్ ఆఫీసు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వంతెన శిథిలం



**రేగిడి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** పాలకొండ- విశాఖపట్నం ప్రధాన రహదారి రేగిడి మండలం సంకిలి నాగావళి నది వంతెన శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జి పొడవునా ఇరువైపులా పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. దీంతో పాటు వంతెనకు రెండువైపులా రంధ్రాలకు మట్టి కూరుకు పోవడంతో వర్షం పడితే నీరు కిందకు వెళ్లకుండా నిల్వ ఉండిపోవడంతో వంతెన పూర్తిగా శిథిలవ్వైంది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులు, పాదాచారులు నానా అవస్థలు పడుతున్నారు. వంతెన పైభాగంలో గత నాలుగు నెలలుగా పచ్చ గడ్డి మొలవడంతో వంతెన మరింత పాడైపోయే ప్రమాదం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు.

ఈ వంతెన 1984లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి టి.అంజయ్య ప్రారంభించారు. 40 ఏళ్లు పూర్తయిన వంతెన నిర్వహణను ఆర్అండ్బి అధికారులు పట్టించుకోకపోవడంతో పూర్తిగా శిథిలమైంది. దీనికి తోడు పిచ్చి మొక్కలు వంతెన ఇరువైపులా ఏర్పడడంతో వర్షానికి పడిన నీరు వంతెన పైన ఉండి పోవడంతో గుంతలు కనిపించక వాహనదారులు అందులో పడి గాయపడుతున్నారు. అసలు ఈ వంతెనకు పాలకొండ ఆర్అండ్బి అధికారులు నిర్వహణ పట్ల బాధ్యత లేకపోవడంతో ఇంత విలువైన వంతెన గుంతలమయమై శిథిలమైనట్లు తెలిస్తోంది. ఈ వంతెన మీదుగా వందలాది వాహనాలు రాకపోకలు చేస్తున్నాయి. పూర్తిగా శిథిలమైన ఈ వంతెన కూలిపోయి ఏదైనా ప్రమాదం జరిగితే ఆర్అండ్బి అధికారులు భారీ మూల్యాన్ని చెల్లించుకోవలసి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి సంకిలి వంతెన దుస్థితిపై విచారణ జరిపి పెద్ద పెద్ద గుంతలను మరమ్మత్తులు జరిపి, పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

## ఉత్సాహంగా విద్యుత్ ఉద్యోగుల సొసైటీ మహాజన సభ




**విజయనగరం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** శ్రీ వెంకటేశ్వర విద్యుత్ ఉద్యోగుల కో- ఆపరేటింగ్ క్రెడిట్ సొసైటీ మహాజన సభ బుధవారం దాసన్నపేట 1104 యూనియన్ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షులు పి.రాము నాయుడు అధ్యక్షతన జరిగింది. మహాజన సభలో ఏప్రిల్ 2నుండి ఆగస్టు 31వ తేదీ వరకు జరిగిన ఆర్థిక కార్యకలాపాలు నివేదికను అధ్యక్షులు రామునాయుడు ప్రవేశపెట్టిగా, కార్యదర్శి బి.కూర్మారావు బలపరచగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. విద్యుత్ ఉద్యోగుల సొసైటీ సభ్యులకు అడిగిన వెంటనే అర్హతను బట్టి రుణాలు ఇస్తున్నామని,ఆర్టికల్, ఎడ్యుకేషన్, మెడికల్ అడ్వాన్స్ కూడా ఇస్తున్నామని తెలిపారు.

సొసైటీ కుటుంబీకుల్లో 10వ తరగతి, ఇంటర్, ఐఐటి, మెడికల్ సీటు సాధించిన పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నామన్నారు. సభ్యులు ఎవరైనా చనిపోతే దహన సంస్కరణ ఖర్చు నిమిత్తం రూ.10వేలు ఇస్తున్నామన్నారు. సభ్యులలో పొదుపుపై అవగాహన పెంచుతున్నామన్నారు. మహాజనసభలో పూర్వపు అధ్యక్షులు డిఆర్ఎస్వి ప్రసాద్ గారు, పూర్వపు ఉపాధ్యక్షులు డి.రాజేంద్రప్రసాద్ , 1104 యూనియన్ రీజనల్ సెక్రెటరీ ఎస్.లక్ష్మణ్ , హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు కెవికె నాగరాజు మాట్లాడారు. ఉపాధ్యక్షులు జి అప్పలనాయుడు, సంయుక్త కార్యదర్శి ఎ రవి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎన్ పైడిరాజు, యస్ మురళీ, ఎన్ రమణ, కె రాజశేఖర్, జి.అప్పలసూరి పాల్గొన్నారు.

# ప్రతి బిడ్డకూ తల్లిపాలే మొదటి టీకా

**చీపురుపల్లి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** పుట్టే ప్రతి బిడ్డకూ తల్లిపాలే మొదటి టీకాగా పనిచేస్తాయని చీపురుపల్లి ఐసిడిఎస్ సూపర్వైజర్ శశికళ వివరించారు. పోషణ మహా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని విజయ కాలనీలో అంగన్వాడి సెంటర్ వద్ద తల్లులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని తల్లిపాల విశిష్టత గురించి తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ భారతి, ఆశా వర్కర్ విజయ తదితరులు పాల్గొన్నారు.నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని మొయిద జంక్షన్ 2 సచివాలయంలో హెల్త్, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రీయ పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ టి.త్రినాధమ్మ, డాక్టర్ శిరీష, చైర్మన్ బంగారు సరోజిని, వార్డ్ కౌన్సిలర్ సత్యనారాయణ, లక్ష్మణరావు, అంగన్వాడి కార్యకర్తలు రమాదేవి, శాంతి, విజయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.గజపతినగరం: మంచి ఆరోగ్యం, మానసిక ఆనందం కోసం పోషకాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు టి.జానకి అన్నారు. బుధవారం మండలంలోని పాత శ్రీరంగరాజపురం గ్రామ సచివాలయం వద్ద పోషకాహార స్టాల్ను అంగన్వాడి కార్యకర్తలు ఏర్పాటు చేశారు. ఆకుకూరలు, పప్పులు, కూరగాయలుతో కలిసి ప్రదర్శన పెట్టారు. అనంతరం మహిళలకు, చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడుపు నాయుడు, కామునాయుడు, అంగన్వాడి కార్యకర్తలు ఊర్మిళ, పద్మ, మహిళా పోలీసు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.గంట్యాడ: ప్రతి తల్లీ సున్నా నుంచి రెండు సంవత్సరాల పిల్లల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఐసిడిఎస్ పీడీ టి.విమలరాణి అన్నారు. కొటారుబిల్లి జంక్షన్ అంగన్వాడీ కేంద్రంలో జరిగిన పోషణ మహా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బోనంగి



గ్రామంలో పోషణ మహా కార్యక్రమానికి సిడిపిఒ ఉమాభారతి హాజరై మాట్లాడారు. సెక్టర్ సూపర్వైజర్ గాయత్రిదేవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలన్నారు. వీటిని బిడ్డకు ఆరు నెలల వరకు ఇస్తే దృడంగా తయారవుతారన్నారు. పెదమజ్జిపాలెం ప్రభుత్వ వైద్యులు సతీష్ కుమార్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే టీకాలను సకాలంలో వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.గుర్ల: ఆరోగ్యవంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాదిగా ఉంటుందని సిడిపిఒ ఆరుద్ర అన్నారు. పోషణ మసోత్సవంలో భాగంగా బుధవారం పల్లిగండ్రేడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ఆరోగ్య సిబ్బంది సమక్షంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పోషణ మాసోత్సవంలో ఐవైసిఎఫ్ యాక్టివిటీలో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్ వైజర్, పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక





# సమన్వయంతో సరస్ నిర్వహణ

**విజయనగరం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** ఈనెల 28 నుంచి ట్యాంక్‌బండ్ రోడ్డులో నిర్వహించనున్న సరస్ ఎగ్జిబిషన్‌ను సమన్వయంతో విజయవంతం చేయాలని డిఆర్‌డిఏ పీడీ శ్రీనివాస్‌పాణి అన్నారు. బుధవారం డిఆర్‌డిఏ కార్యాలయంలో డిపిఎంలు, ఎపిఎంలతో సరస్ ఎగ్జిబిషన్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. విద్యుత్, మెడికల్ అండ్ హెల్త్, పోలీస్, మున్సిపల్, అగ్నిమాపక శాఖ వారితో సమన్వయం చేసుకొని ఎటువంటి అంతరాయం లేకుండా పక్క ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. శానిటేషన్, క్లీనింగ్,మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు, మంచినీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు మున్సిపల్ కమిషనర్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు.

ఈ సరస్ లో ప్రత్యేక ఆకర్షణగా ఫ్లవర్ షో ఉద్యానవనం శాఖ సమన్వయంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. సరస్‌కు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డితో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ డ్వాక్రా బజార్‌లో స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ కళాకారులు తయారు చేసిన చేనేత హస్త కళలు, చేనేత ఉత్పత్తులు, గృహ అలంకరణలు, ఆహార ఉత్పత్తుల ప్రదర్శనతోపాటు అమ్మకాలు జరుగుతాయని, ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ శ్రీనివాసరావు, ఎపిడి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.




## చలో విశాఖ డెయిరీ ఉద్రిక్తం

**గాజువాక (విశాఖపట్నం) ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** పాల రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ విశాఖ డెయిరీ పాల రైతుల సంఘం ఆధ్వర్యాన బుధవారం తలపెట్టిన చలో విశాఖ డెయిరీ కార్యక్రమం పోలీసుల చర్యతో ఉద్రిక్తంగా మారింది. తమ కష్టాలను చెప్పుకునేందుకు వచ్చిన పాల రైతులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఆరుగురిని అరెస్టు చేశారు. విశాఖ డెయిరీలో జరిగిన అవినీతిపై వేసిన హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి, దోషులను శిక్షించాలని, డెయిరీ ఆస్తులను కాపాడాలని, పాల సేకరణ ధర లీటర్‌కు కనీసం రూ.10 పెంచాలని, ప్రతి మూడు నెలలకూ బోనస్ ఇవ్వాలని, చనిపోయిన పాల రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర ప్రాంతంలోని పాల రైతులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. విశాఖ డెయిరీ మహాజన సభ షీలానగర్ ప్రాంతంలోని కృషి ఐకాన్ హాస్పిటల్ వెనుక జరుగుతుండటంతో అక్కడకు వెళ్లి వినతిపత్రం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. షీలా నగర్ జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రహదారిపైనే పాల రైతులు ఆందోళనకు దిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నినాదాలతో హోరెత్తించారు.

# శిథిలావస్థలో క్షయ నివారణ కార్యాలయం

- ఊడుతున్న స్లాబ్ పెచ్చులు..కుంగిపోయిన ఫ్లోరింగ్
- వర్షం వస్తే జలమయం
- బితుకు బితుకుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



**విజయనగరం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** విజయనగరం జిల్లా కేంద్రంలో గల జిల్లా క్షయ నివారణ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది .1990లో నిర్మించిన ఈ భవనం నేడు శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలిపోతుందా అన్నట్లు ఉంది. వర్షం పడితే చాలు కార్యాలయం తడిసి ముద్దవుతుంది. విజయనగరం జిల్లాకు సంబంధించిన క్షయ నివారణ మందులు, వైద్య పరికరాలు వైద్య సేవలు కూడా ఈ కార్యాలయం నుంచే అందిస్తారు. ఇక్కడి నుంచే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కఫం పరీక్షలకు సంబంధించిన ప్లాస్టిక్ బాక్సులు తరలిస్తుంటారు. అంతేకాకుండా వందల సంఖ్యలో రోగులు ప్రతిరోజు జిల్లా క్షయ నివారణ కార్యాలయానికి వచ్చి పలు పరీక్షలతో పాటు వైద్య సేవలు పొందుతుంటారు. అంతటి ప్రాధాన్యత గల కార్యాలయం నేడు గత కొన్ని సంవత్సరాలుగా శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాధుడే కొరువయ్యారు. భవనం నిర్మించి 35ఏళ్లు కావడంతో స్లాబ్ పెచ్చులూడిపోయింది. కింద ఫ్లోరింగ్‌గా వేసిన టైల్స్ ఊడిపోయి కిందకు దిగిపోయింది. మరోవైపు ఎక్కడికక్కడ బీటలు వారడం, వర్షం పడితే తడిచిపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు విష జంతువులు సైతం అప్పుడప్పుడూ వచ్చేస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. ఈనేపథ్యంలో వారంతా బితుకు బితుకు మంటూ విధులు నిర్వహిస్తున్నారు. గచ్చు పెచ్చులు కూడా ఊడిపోయి చిందర వందరగా పడి ఉన్నాయి. వర్షం పడిందంటే చాలు జిల్లా క్షయ నివారణ కార్యాలయం తడిసి ముద్దవుతుంది. కార్యాలయంలో రికార్డులు భద్రపరిచేందుకు కూడా అవకాశం లేకుండా పోతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో అత్యంత ప్రాధాన్యత గల జిల్లా క్షయ నివారణ కార్యాలయంకు మంచి భవనం లేకపోవడంతో రోగులు ఆసుపత్రికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లా మంత్రి, కలెక్టర్, జిల్లా అధికారులు కలుగజేసుకొని జిల్లా క్షయ నివారణ కార్యాలయాన్ని వేరొక భవనంలోకి తరలించడం లేదా కొత్త భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న జిల్లా క్షయ నివారణ కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్న మాట వాస్తవమే. స్లాబ్ పై పెచ్చులు ఊడిపోవడం, ఫ్లోరింగ్ గచ్చు కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో కార్యాలయం చిందర వందరగా తయారయ్యింది. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నూతన భవనం నిర్మించడం లేదా వేరొక భవనంలోకి మార్చాలని ప్రతిపాదనలు పంపించాం.

## కోలాహలంగా సిరిమాను తరలింపు

**- ఉత్సవాల్లో భాగస్వాములు కావాలి : మంత్రి కొండపల్లి**



**గంట్యాడ / విజయనగరం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** పైడితల్లి అమ్మవారి పండగ, విజయనగరం ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గంట్యాడ మండలం కొండ తామరాపల్లి గ్రామంలో గుర్తించిన పైడితల్లి అమ్మవారికి ప్రతిరూపంగా భావించే సిరిమాను చెట్టును మంత్రి శ్రీనివాస్ బుధవారం సతీసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాల, మధ్య చెట్టుకు గొడ్డలితో గాట్లు పెట్టి సిరిమాను తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అనంతరం అక్కడి నుంచి విజయనగరంలోని పూజారి నివాసముంటున్న హుకుంపేటకు సిరిమానును తరలించారు. అడుగడుగునా ప్రజలు సిరిమానుకు నీరాజనాలు పట్టారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర కల్పవల్లి పైడితల్లి అమ్మవారు విజయానికి ప్రతిరూపమని పేర్కొన్నారు. అమ్మవారి సిరిమాను పండుగను, దానితోపాటుగా విజయనగరం ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. అమ్మవారు రాష్ట్రాన్ని చల్లగా చూడాలని, పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉద్యోగాలు రావాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులనాయుడు, తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి, ఆర్‌డిఒ డి.కీర్తి, పైడితల్లి అమ్మవారి దేవస్థానం సహాయ కమిషనర్ కె.శిరీష, డిఎఫ్ఒ కొండలరావు, డిఎస్‌పి గోవిందరావు, తాహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి, వైసిపి నాయకులు కోలగట్ల వీరభద్ర స్వామి, కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి రాజేష్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారు నాయుడు, చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర, ఇరుసుమాను చెట్ల దాతలైన రైతులు చల్లా అప్పలనాయుడు, నారాయణమూర్తి, రామకృష్ణ, లోకవరపు సత్యం, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

## మా పొట్ట కొట్టకండి




**గుమ్మలక్ష్మీపురం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** నెలల తరబడి జీతాలివ్వకున్నా ఉన్న ఉద్యోగాన్ని నమ్ముకుని పనిచేస్తున్న తమను తొలగించి మా పొట్టకొట్టకండి అంటూ గుమ్మలక్ష్మీపురం గిరిజన గర్భిణుల వసతి గృహంలో పనిచేస్తున్న తాత్కాలిక ఆరోగ్య కార్యకర్తలు కన్నీటిపర్యమవుతున్నారు. ఐటిడిఎ బడ్జెట్‌లో నిధుల్లేవని, జీతాల చెల్లించలేమని మిమ్మల్ని తొలగిస్తున్నామని అధికారులు చెప్పడంతో ఆందోళనకు గురయ్యారు. తమ ఉద్యోగానికి భద్రత కల్పించి కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే గుమ్మలక్ష్మీపురం వైటిసిలో గిరిజన గర్భిణుల వసతి గృహాన్ని 2019లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇక్కడ 12 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో ఒక స్టాఫ్ నర్స్, ఏడుగురు ఎఎన్ఎంలు, ముగ్గురు స్వీపర్లు, ఒక డ్రైవరు ఉన్నారు. అయితే గత మార్చి నుంచి సెప్టెంబర్ వరకు వేతన బకాయిలు ఉన్నాయి. నెలవారీ జీతాలు రాకపోయినా బాధపడలేదు. ఉన్న ఉద్యోగాన్ని కాపాడుకోవాలంటూ బాధ్యతతో పనిచేస్తూ వస్తున్నారు. ఇదే సమయంలో ఐటిడిఎ అధికారులు పిడుగులాంటి వార్త చెప్పారు. నిధుల్లేవని, మిమ్మల్ని తొలగిస్తున్నామంటూ నోటి మాట ద్వారా సెలవిచ్చారు. కాబోయే అమ్మకు కంటికి రెప్పలాకాబోయే అమ్మ ఆరోగ్యంగా ఉండడానికి, సుఖప్రసవం కావడానికి గర్భిణుల వసతి గృహ ఆరోగ్య సిబ్బంది కంటికి రెప్పలా చూసుకుంటూ సేవలందిస్తూ వచ్చారు. ఇక్కడ 15 మంది గర్భిణులు సేవలు పొందుతున్నారు. పౌష్టికాహారం అందజేస్తారు. యోగా చేయిస్తారు. ప్రసూతి వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణలో పరీక్షలు, వైద్యం అందిస్తారు. అత్యవసరమైతే స్థానికంగా ఉన్న ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రిలో చేర్పించి సుఖ ప్రసవమయ్యేలా చూస్తారు. ఇన్ని సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బందిని తొలగింపు చర్యలు చేపట్టడం విచారకరం. ప్రస్తుతం ఇక్కడ రెగ్యులర్ ఉద్యోగులను నియమించారు. వీరు మంగళవారం వీధుల్లో చేరారు.4,440 మంది గర్భిణులకు సేవలు కొండ శిఖర గ్రామాల్లో రహదారి సౌకర్యం లేక వైద్యం కోసం వస్తున్న గర్భిణులకు డోలిలే శరణ్యమవుతున్నాయని, సరైన వైద్య సేవలందడం లేదని అప్పటి పార్వతీపురం ఐటిడిఎ పిఒ లక్ష్మీషా గర్భిణుల వసతి గృహం ఏర్పాటుకు రూపకల్పన చేశారు. మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, సాలూరు, సీతంపేట మండలాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు సుమారుగా 4,440 మంది గర్భిణులు సేవలు పొందారు. రోడ్డున పడేశారు గర్భిణుల వసతి గృహం ఏర్పాటు చేసిన నాటి నుంచి నేటి వరకు బాధ్యతతో విధులు నిర్వహించాను. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా సమయంలో కూడా గర్భిణులకు కరోనా సోకితే సేవలందించాను. ఉద్యోగ భద్రత దొరుకుతుంది అనుకుంటే ఉద్యోగమే లేకుండా రోడ్డును పడేశారు. మహాలక్ష్మి . ఎఎన్ఎం, గుమ్మలక్ష్మీపురం. సకాలంలో వేతనాలివ్వకపోయినా పని చేశాం సకాలంలో వేతనాలు చెల్లించకపోయినా బాధ్యతగానే పనిచేశాం. నెలనెలా వేతనాలు ఇవ్వలేదని ఎప్పుడు బాధపడలేదు.

## నాలుగు రోడ్ల విస్తరణ



**కొమరాడ ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** మండల ప్రజలు దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న నాలుగు రోడ్ల విస్తరణకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ మేరకు చిలకపాలెం –రామభద్రపురం –బొబ్బిలి – పార్వతీపురం – కొమరాడ మీదుగా రాయగడ వరకు నాలుగు రోడ్ల విస్తరణకు సర్వే పూర్తయింది. గతంలో ఈ రహదారిలో ప్రయాణించాలంటే నాలుగు కిలోమీటర్ల దూరంలో మూడు రైల్వే గేట్లు ఉండడంతో నిత్యం రాకపోకలు చేసే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో ఎప్పుడు రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణాలు జరుగుతాయా? రైల్వే గేట్లు బాధ ఎప్పుడు తప్పుతుందోనని ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు ఈ ప్రాంత ప్రజల కల నెరవేరబోతుంది. నాలుగు రోడ్లు హైవే, మూడు ఫ్లై ఓవర్లతో మండల రూపురేఖలు మారబోతున్నాయి. కొమరాడ మండలంలోని ప్రధానంగా ఆంధ్రా – ఒడిశాతో పాటు చత్తీష్‌గడ్, మధ్యప్రదేశ్ అంతర్రాష్ట్ర రహదారి 25 కిలోమీటర్ల మేర విస్తీర్ణంలో ఉంది. గత పదేళ్లుగా ఈ రహదారి నాలుగు రోడ్లు విస్తరణ జరగాల్సి ఉంది. ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీష్‌ఘడ్‌లో ఉన్న వివిధ పరిశ్రమలకు నిత్యం ఈ రహదారి గుండా భారీ లారీల ద్వారా మిషనరీ సామాగ్రి తరలింపు జరుగుతుంది. ఈ రహదారిపై భారీ వాహనాల రాకపోకలు జరగడంతో గత పదేళ్ల క్రితం నాలుగు రోడ్ల విస్తరణకు అప్పటి ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. అయితే ప్రభుత్వాలు మారడంతో ఈ రోడ్డుకు ప్రాధాన్యత ఇచ్చి నాలుగు రోడ్లు విస్తరించేందుకు ముందుకు ఎవరూ రాలేదు. ఇటీవల కేంద్రప్రభుత్వం నాలుగురోడ్లు విస్తరణ, మూడు ఫ్లైఓవర్ల నిర్మాణాలకు ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో చిలకపాలెం –రామభద్రపురం –బొబ్బిలి పార్వతీపురం మీదుగా కొమరాడ నుంచి రాయగడ వరకు నాలుగు రోడ్లు విస్తరణ సర్వే ఇటీవల కాలంలో ఒక ప్రైవేట్ కంపెనీ యాజమాన్యం పూర్తి చేసింది. ఈ రహదారిలో ప్రధాన సమస్యలైన రైల్వే గేట్లతో ప్రజలు నిత్యం నానా అవస్థలు పడుతూ ట్రాఫిక్ అంతరాయాల్లో ఇరుక్కుపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా నాలుగు కిలోమీటర్ల దూరంలో మూడు రైల్వే గేట్లు ఉన్నాయి. వీటిపై మూడు ఫ్లైఓవర్లు నిర్మాణాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో నాలుగు రోడ్ల విస్తరణ పనులు మందకోడిగా సాగిం దని చెప్పొచ్చు. గతంలో రైల్వే ఫ్లైఓవర్లు ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం నిధులు మంజూరు చేసి ఫ్లైఓవర్ వంతెన పనులు చేసేవారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఫ్లైఓవర్ ఏర్పాటుకు వందశాతం నిధులు కేటాయించడంతో ఈ మూడు రైల్వే గేట్లు వద్ద మూడు ఫ్లైఓవర్ వంతెనలు మంజూరయ్యాయి. దీంతో ఇప్పటికే ఈ మూడు రైల్వే గేట్లు పరిధిలో ఉన్న ఫ్లై ఓవర్లు వంతెనల నిర్మాణాలకు సంబంధించి ఊహా చిత్రాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. మండలంలోని అర్తాం, స్వామి నాయుడు వలస, గంగరేగు వలస రైల్వే గేట్లు వద్ద ఫ్లై ఓవర్లకు సంబంధించి భూ సేకరణకు రైల్వే, రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు. మూడు గేట్లు వద్ద ఫ్లైఓవర్ వంతెనలు ఏర్పాటుకు ఇప్పటికే రైల్వే శాఖ అధికారులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు. ఎక్కడైతే ఫ్లైఓవర్ నిర్మాణాలు జరుగుతాయో ఆయా గ్రామాలతో గ్రామ సభలు ఏర్పాటు చేసి భూ సేకరణకు రెవెన్యూ అధికారులు త్వరలో చర్యలు చేపట్టాల్సి ఉంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం మూడు రైల్వే గేట్లలో రెండు గేట్లను తప్పించి ఒకే దగ్గర ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టేందుకు అప్పట్లో ప్రణాళికలు సిద్ధం చేశారు. అర్తాం కొండ పక్క నుంచి సోమినాయుడు వలస రైల్వే గేట్ వరకు రహదారి సౌకర్యం కల్పిస్తే అర్తాం, సోమి నాయుడు వలస రైల్వే గేట్లు తప్పించేందుకు అవకాశాలు ఉన్నాయని, గంగరేగువలస వద్ద ఫ్లైఓవర్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమా చారం. అయితే ఇప్పుడు ఫ్లైఓవర్ నిర్మాణాలకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభు త్వం కేటాయించడంతో ఈ మూడు రైల్వే గేట్లు వద్ద ఫ్లైఓవర్ వంతెనల నిర్మాణాలు కానున్నాయి. దీంతో కొమరాడ మండలంలోని నాలుగు రోడ్లు విస్తరణతో పాటు మూడు రైల్వే గేట్లపై వంతెనలు నిర్మాణాలు జరిగితే ఈ మండల రూపురేఖలు మారి అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.




# నగరంలో పండగ శోభ



**విజయనగరం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 24 :** పైడితల్లమ్మ జాతర సమీపిస్తున్న తరుణంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వివిధ మరమ్మతు, సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విజయనగరం నగరపాలక ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది రోడ్డు గుంతలు పూడ్చివేత, రహదారుల మరమ్మతులు, కాలువల నిర్మాణ పనులు, డివైడర్లకు రంగులు అద్దే ప్రక్రియలను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. శివాలయం వీధి, కొత్తపేట, దాసన్నపేట, పోలయ్యపేట, ఇప్పిలి వీధి తదితర ప్రాంతాలలో రహదారి మరమ్మతు పనులను చేపడుతున్నారు. డివైడర్లకు ఉన్న గ్రిల్స్‌కు ఆకర్షణీయమైన రంగులను అద్దుతున్నారు. 39వ డివిజన్ వివేకానంద కాలనీలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. 27వ డివిజన్ జొన్న గుడ్డి ప్రాంతంలో జెసిబి సహాయంతో పైప్ లైన్లు ఏర్పాటు అనంతరం ఉన్న వ్యర్థ నిర్మాణ సామాగ్రిని తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. గురజాడ అప్పారావు రోడ్డు ప్రాంతంలో గుంతలు పూడ్చివేత కార్యక్రమాన్ని చేపట్టారు. రింగ్ రోడ్డు ప్రాంతంలో డివైడర్లకు ఉన్న గ్రిల్స్‌కు రంగుల అద్దే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. జరుగుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించారా లేదా అన్న విషయాన్ని ఈఈ ప్రసాదు సిబ్బందితో పరిశీలించారు. ఆర్ అండ్ బి జంక్షన్ వద్ద జరిగిన పనుల నాణ్యతను గమనించారు. మూడు లాంతర్లు నుండి కోట వరకు ఉన్న రహదారి గోతులను పూడ్చివేస్తున్నారు. 2వ డివిజన్ హాజీ అలీ నగర్‌లో కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. మరో వైపు మూడు లాంతర్లను ఆకర్షణీయంగా తయారు చేశారు. ఇంకో వైపు సాంస్కృతిక విజయనగరం పేరుతో ఆకర్షణీయంగా విద్యుత్ వెలుగులతో కూడిన జంక్షన్‌ను ఆకర్షణీయంగా తయారు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పైడితల్లి అమ్మవారి జాతర నేపథ్యంలో అన్ని ప్రాంతాలలో మరమ్మతు పనులు, ఇతర నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికను చేపడుతున్నామన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా అవసరమైన అన్ని చర్యలనూ తీసుకుంటున్నామన్నారు